తీరనున్న తాగునీటి సమస్య



చండూరులో కొనసాగుతున్న ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు



ముమ్మరంగా సాగుతున్న పైప్‌లైన్ పనులు

- చండూరుకు రూ.9 కోట్ల 80 లక్షల అమృత్ నిధులు మంజూరు
- ముమ్మరంగా సాగుతున్న పనులు
- మార్చి వరకు పూర్తిచేసేలా ప్రణాళిక

చండూరు : మున్సిపల్ పరిధిలోని ప్రజలకు త్వరలో తాగు నీటి సమస్యకు చెక్ పడనుంది. గతంలో మిషన్ భగీరథతో మంచి నీటి సమస్య తీరుతుందని భావిస్తే సంబంధిత అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ అలసత్వం కారణంగా ఈ పథకం చండూరు పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో అందలేదు. దీంతో పట్టణ ప్రజలకు నీటి కష్టాలు తప్పలేదు. ఇక అమృత్ 2.0 పథకంతో చండూరు పట్టణంలో మంచి నీటి సమస్య తీరబోతోంది. ఆగస్టులో చండూరు పట్టణంలో అమృత్ 2.0 పథకం పనులకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రెండు ట్యాంకులు, 1.5 కిలోమీటర్ వరకు పైపులైన్ పనులు కొనసాగుతున్నాయి. వచ్చే మార్చి నాటికి పనులు పూర్తి చేయాలనే నిబంధనలు ఉన్నాయి.

రూ.9 కోట్ల 80 లక్షల నిధులు..

చండూరు పట్టణంలో నీటి సమస్య తీర్చేందుకు అమృత్ 2.0 పథకంలో భాగంగా కేంద్రం నిధులు 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం, మిగిలిన 20 శాతం నిధులు మున్సిపల్ (15వ ఫైనాన్స్ నిధులు) నుంచి మొత్తం రూ.9 కోట్ల 80 లక్షలు మంజూరయ్యాయి. వీటి ద్వారా ఒక్కోటి 5 లక్షల లీటర్ల సామర్థ్యం గల రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఒకటి, సన్‌షైన్ స్కూల్ రోడ్డులో మరో ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నారు. ఇవేకాకుండా పట్టణంలో అవసరమైన మేరకు పైప్‌లైన్ వేస్తున్నారు. నల్లాలు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికీ తాగు నీరు అందేలా చర్యలు తీసుకోబోతున్నారు. ఇప్పటికే పట్టణ వ్యాప్తంగా 11 లక్షల లీటర్ల సామర్థ్యం గల 13 ట్యాంకులు ఉన్నాయి. నూతన ట్యాంకులు, పాతవి కలుపుకుంటే మొత్తంగా 21 లక్షల లీటర్ల నీటిని పట్టణంలో సరఫరా చేయనున్నారు. పనులు పూర్తయితే చండూరు పట్టణంలో నీటి సమస్య లేకుండా పోతుంది.

సరిపడా ట్యాంకులు లేకపోవడంతో..

పట్టణ పరిధిలో 10 వార్డులు ఉన్నాయి. 13,000 వేల వరకు ఓటర్లు ఉన్నారు. సరిపడా ఓవర్‌హెడ్ ట్యాంకులు లేకపోవడంతో అంగడిపేట పరిధిలో అనేక కాలనీల్లో నీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రజలకు చాలావరకు స్వచ్ఛమైన నీరు అందడం లేదు. ప్యూరిఫైడ్ నీరు కొనుగోలు చేసి తాగుతున్నారు. అమృత్ 2.0 పథకం పూర్తయితే ఇక తాగు నీటి సమస్యకు చెక్ పడనుంది.

ఇబ్బందులు తప్పుతాయి



చండూరు మున్సిపాలిటీలో నీటి సమస్య తీర్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి చండూరు ప్రజలందరం రుణపడి ఉంటాం. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని ఎమ్మెల్యే అమలు చేస్తున్నారు. చండూరు మున్సిపాలిటీ అభివృద్ధిపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి పెట్టారు. నీటి ట్యాంకుల నిర్మాణం పూర్తయితే చండూరు ప్రజల ఇబ్బందులు తప్పుతాయి.

–చంద్రశేఖర్‌గౌడ్, చండూరు

రూ.9 కోట్ల 80 లక్షలు మంజూరయ్యాయి



చండూరు మున్సిపాలిటీలో అమృత్ 2.0 పథకానికి రూ.9 కోట్ల 80 లక్షలు మంజూరయ్యాయి. ఆగస్టులో పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆ నిధులతో ఒక్కోటి 5 లక్షల నీటి సామర్థ్యం గల రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నాం. పైపులైన్ 1.5 కిలో మీటర్ మేర పూర్తి చేశాం. పనులు వచ్చే మార్చిలోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

–నాగ ప్రసాద్, ఏఈఈ, పీహెచ్(పబ్లిక్ హెల్త్)

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి



శానిటరీ ప్యాడ్స్ అందజేస్తున్న ఐఎంఏ సభ్యులు

నల్లగొండటౌన్: బాలికలు రక్త శాతాన్ని పెంచే డైట్, ఆకుకూరలు, గుడ్లు పౌష్టికాహారం తీసుకోవాలని అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ అనితారాణి అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు దేవరకొండ రోడ్డులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, బాలికల పాఠశాల, బోయవాడలోని బాలికల, ప్రైమరీ స్కూల్, హైస్కూల్, మాన్‌ఫోర్ట్, సెయింట్ ఆల్ఫోన్సెస్ పాఠశాలల బాలికలకు సుమారు రూ.30 వేల విలువగల శానిటరీ ప్యాడ్స్ అందజేశారు. ఈ సందర్భంగా అనితారాణి మాట్లాడుతూ పేదరికం నుంచి వచ్చిన బాలికలు ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కల్పించి కొంత సహాయం చేయాలనే ఉద్దేశంతో శానిటరీ ప్యాడ్స్ అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లారావు, డాక్టర్ రాజేశ్వరి, సుధారాణి, పెంటయ్య, కిరణ్, సుజాత, హేమమాలిని, ఆనంద్, అనిత , విద్యార్థినులు పాల్గొన్నారు.



శివలింగానికి జలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

మహా పడిపూజ

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామంలో గల శ్రీపార్వతి శంభులింగేశ్వరస్వామి ఆలయం (శివాలయం)లో శివ మాలధారులు సోమవారం ద్వాదశ జ్యోతిర్లింగ ప్రథమ మహా పడిపూజ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అందంగా అలంకరించిన ప్రత్యేక మండపంలో శివపార్వతుల చిత్రపటాలతోపాటు శివలింగాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వల్లాల గ్రామానికి చెందిన శివమాలాధారుడు భూపతి ఉపేందర్ సొంత ఖర్చులతో నిర్వహించిన శివ మహాపడిపూజ కార్యక్రమానికి తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు వావిలాల రామలింగేశ్వరశర్మ, గురుస్వామి కట్టగూరి వెంకన్నల నేతృత్వంలో పూజాకార్యక్రమాలు కనులపండువగా జరిగాయి.

ఎన్‌సీసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

రామగిరి(నల్లగొండ): ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్‌జీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్జీ కళాశాలలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ లక్ష్మారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్, తలసేమియా, హేమోఫిలియా వంటి వ్యాధులు ఉన్నవారికి రక్తం అత్యవసరం అన్నారు. కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ చిలుముల సుధాకర్ మాట్లాడుతూ రక్తదాన కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌సీసీ క్యాడెట్లు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పేదలపై పన్నుల భారం మోపుతున్న కేంద్రం



మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

కేతేపల్లి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సంపన్నులకు రాయితీలు ఇస్తూ పేదలపై పన్నుల భారాన్ని మోపుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం కేతేపల్లిలోని సంద్యాల శ్రీనివాస్‌రెడ్డి స్మారక భవనంలో నిర్వహించిన సీపీఎం 8వ మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల స్థానంలో లేబర్ కోడ్‌లను అమల్లోకి తీసుకువచ్చి కార్మికుల శ్రమను దోపిడీ చేస్తోందన్నారు. ముందుగా వారు అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఈసమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల, బొల్ల నర్సింహారెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చిన వెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, ఏళ్ల అశోక్‌రెడ్డి, ఎల్.రాజు, కోట లింగయ్య, కె.శోభన్, భాగ్యమ్మ, అల్లి ప్రభాకర్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా డేటా ఎంట్రీ చేయాలి

కట్టంగూర్ : సమగ్ర కుటుంబ సర్వే వివరాలను డేటా ఆపరేటర్లు ఎలాంటి తప్పుల్లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ గుగులోతు ప్రసాద్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆపరేటర్లు నిర్వహిస్తున్న డేటా ఎంట్రీని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ నెల 30వ తేదీ వరకు డేటాను ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన డేటాను గోప్యంగా ఉంచాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ జ్ఞాన ప్రకాశ్ రావు, ఎంపీఓ చింతమల్ల చలపతి, ఆర్‌ఐ కుమార్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్ సట్టు గోపి ఉన్నారు.

సాగునీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలి



సాగు నీటిని విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

శాలిగౌరారం: రైతులు సాగు నీటిని పొదుపుగా వాడుకుని ఆయకట్టు చివరి భూములకు సాగునీరందేలా చూడాలని ఇరిగేషన్ ఏఈ రాములు అన్నారు. శాలిగౌరారం మండలంలోని మాధారంకలాన్ గ్రామం రామనీల సముద్రం జంట చెరువుల నుంచి సోమవారం యాసంగి పంటకు సాగునీటిని డీసీసీ నాయకుడు అన్నెబోయిన సుధాకర్, మాజీ ఎంపీటీసీ నోముల జనార్దన్‌తో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పంట కాల్వలను శుభ్ర పరుచుకుని సాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేందర్, స్థానిక నాయకులు మాచర్ల శ్రీను, వెంకన్న, సైదులు, నిరంజన్, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మర్రిగూడ : బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చింతపల్లి సీడీపీఓ సక్కుబాయి అన్నారు. సోమవారం మర్రిగూడ మండలంలోని రాజాపేటతండా, మర్రిగూడతోపాటు పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించాలని, బాలింతలకు, చిన్నారులకు కావాల్సిన సమతుల్య ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన చిట్యాల గ్రీన్ గ్రోవ్ స్కూల్ విద్యార్థులు

చిట్యాల: పట్టణంలోని గ్రీన్ గ్రోవ్ స్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఈ నెల 21వ తేదీన నల్లగొండలో జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి అండర్–14 హాకీ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ స్కూల్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, పీఈటీ గంగాపురం రాము సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు రాధారపు జెస్సి, భవ్యశ్రీ, తన్విశ్రీ, షేక్ సోను సోహెల్‌లతోపాటు స్టాండ్ బై క్రీడాకారులుగా ఆగు దివ్యభాను ఎంపికయ్యారు. వీరు ఈ నెల 28, 29, 30వ తేదీల్లో హుజూరాబాద్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.



నార్కట్‌పల్లి : రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

అక్కెనపల్లి హైస్కూల్ విద్యార్థులు..

నార్కట్‌పల్లి : జిల్లా కేంద్రంలో ఈ నెల 21న జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా హాకీ పోటీల్లో నార్కట్‌పల్లి మండలంలోని అక్కెనపల్లి హైస్కూల్ విద్యార్థులు మర్రి మనోజ్, ఆవుల ఉదయ్ ప్రతిభ కనబర్చి అండర్–14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నడింపల్లి వెంకటేశం, వ్యాయామ ఉపాధ్యాయుడు ఇమామ్ కరీం తెలిపారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



రామలింగేశ్వర స్వామి ఆలయంలో వ్రతంలో పాల్గొన్న భక్తులు

నకిరేకల్ : కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా నకిరేకల్ పట్టణ కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి శివాలయంలో భక్తులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో శివాలయ చైర్మన్ ఉప్పల రమేష్, ధర్మకర్తలు చంద్రశేఖర్, కందాల ప్రవీణ్, జిగురు లక్ష్మి, నర్సింహమూర్తి, వీర్లపాటి జయమ్మ, కొత్తూరు వెంకన్న తదితరులు ఉన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

మునుగోడు: పంటల అధిక దిగుబడి కోసం రైతులు రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి పద్మజ రైతులకు సూచించారు. సోమవారం మునుగోడు మండలంలోని పులిపలుపుల గ్రామ రైతు వేదికలో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీఏపీ వాడడం వల్ల పెట్టుబడి పెరిగి భూసారం తగ్గుతుందన్నారు. అదే కాంప్లెక్స్ ఎరువులు వినియోగిస్తే అధిక దిగుబడి వస్తుందని, పెట్టుబడి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నర్సింహ పాల్గొన్నారు.

విద్యార్థులతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న వెంకటేష్

నల్లగొండ టౌన్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం విద్యార్థులతో చెలగాటమాడుతోందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగేల వెంకటేష్ ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఏఐఎస్‌ఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన నల్లగొండ పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్ బోర్డ్ నిర్ణయించిన పరీక్ష ఫీజులను మాత్రమే కళాశాల యాజమాన్యం వసూలు చేయాలని, అధికంగా వసూలు చేసిన కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోలని డిమాండ్ చేశారు. సమావేశంలో వలమల్ల ఆంజనేయులు, గాదెపాక సూర్యతేజ, శంకర్, హర్షవర్ధన్, బి సాయి,ఎన్ శివ ప్రసాద్, మధు పాల్గొన్నారు.

మెటీరియల్ అందజేత

కనగల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఆధ్వర్యంలో కనగల్ మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి ఆదివారం పీఎమ్‌జేఎఫ్ లయన్ తీగల మోహన్‌రావు ఆర్థిక సహకారంతో డిజిటల్ టీవీ, మోడల్ స్కూల్‌కు మదన్‌మోహన్ సహకారంతో స్పోర్ట్స్ మెటీరియల్ అందజేశారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఆమంచి రాజలింగం, చిలుకూరి రామకృష్ణ, నర్సింగ్ లక్ష్మయ్యగౌడ్, నీలకంఠం శేఖర్ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న శ్రీనివాస్

నల్లగొండ టౌన్: రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించకపోతే రిలే నిరాహార దీక్షలు, ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామన్నారు. కృష్ణయాదవ్, శంకర్, గిరి, జగన్, ఎల్లయ్య పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందన

నల్లగొండ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి 50 కేజీల విభాగం బాలుర వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించిన నల్లగొండ పట్టణంలోని డైట్ స్కూల్ విద్యార్థి షేక్ జునైద్‌ను సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి దగ్గుబాటి విమల, వ్యాయామ ఉపాధ్యాయులు మహ్మద్ అష్రఫ్, మమ్మద్ నాజిం పాల్గొన్నారు.



క్రీడాకారుడిని అభినందిస్తున్న కలెక్టర్

ఆర్డీఓకు వినతి

నల్లగొండ రూరల్: మండలంలోని అప్పాజీపేట గ్రామం కాకి చెరువు నుంచి అక్రమంగా రోడ్డు నిర్మాణానికి మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సోమవారం నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డికి, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మట్టి తరలింపుతో భూగర్భ జలాలు అడుగంటడంతోపాటు చెరువు మట్టి రోడ్డు నిర్మాణానికి ఉపయోగించడంతో రోడ్డు నాణ్యత కొరవడుతుందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో వెంకన్న, కమలాకర్ ఉన్నారు.

‘కార్తీక’ పూజలు

కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా నల్లగొండ పట్టణంలోని శివాలయాల వద్ద భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజ స్తంభాల వద్ద దీపాలు వెలిగించారు. మహిళలు సాయంత్రం దీపాలు వెలిగించి కోనేరులో వదిలి పెట్టారు. ఛాయాసోమేశ్వరాలయం , పచ్చల సోమేశ్వరాలయంలో భక్తులు భారీ సంఖ్యలో పూజలో పాల్గొన్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



ఛాయా సోమేశ్వరాలయం వద్ద కోనేరులో దీపాలు వదులుతున్న భక్తులు



పచ్చల సోమేశ్వరాలయంలో నందికి మొక్కుతున్న భక్తులు



ఛాయా సోమేశ్వరాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



ఛాయా సోమేశ్వరాలయంలో ఆత్మలింగం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నార్కట్‌పల్లి : మండలంలోని నార్కట్‌పల్లి, బి వెల్లంల, చెర్వుగట్టు విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఆయా సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

శివలీలకు అవార్డు



అవార్డు అందుకుంటున్న శివలీల

కనగల్ : మండల కేంద్రానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త, న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శివలీలకు కొమురం భీం అవార్డు దక్కింది. ఆదివారం అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ చైర్మన్ సరోజినమ్మ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో శివలీలకు అవార్డు అందజేశారు.

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్‌గా యాదగిరి

మునుగోడు: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్‌గా మునుగోడు మండలంలోని ఊకొండి గ్రామానికి చెందిన చలిచీమల యాదగిరి నియమితులయ్యారు. ఈ మేరకు కమిటీ చైర్మన్ బోడ స్వామి సోమవారం యాదగిరికి నియామకపత్రం అందజేశారు.

జిల్లా సహాయ కార్యదర్శిగా లింగస్వామి

డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శిగా మునుగోడు మండలంలోని కల్వకుంట్ల గ్రామానికి చెందిన కట్ట లింగస్వామి ఎన్నికయ్యారు. ఈ నెల 24, 25 తేదీల్లో చిట్యాల మండల కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో లింగస్వామిని ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

సీపీఎం కార్యదర్శిగా లూర్దుమారయ్య

కేతేపల్లి: సీపీఎం మండల కార్యదర్శిగా కేతేపల్లికి చెందిన చింతపల్లి లూర్దు మారయ్య వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం కేతేపల్లిలో నిర్వహించిన సీపీఎం 8వ మండల మహాసభల్లో పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి సమక్షంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా బొజ్జ చినవెంకులు, ఏళ్ల అశోక్‌రెడ్డి, లకపాక రాజు, కోట లింగయ్య, చౌగోని నాగయ్య, చెరుకు సత్తయ్య, భాగ్యమ్మ, కర్ర బాలయ్య, సొడయ్య, ఊర ఎల్లయ్య, వంగూరి వెంకన్న, గోలి ఎల్లయ్యలు ఎన్నికయ్యారు.

సాంస్కృతిక కార్యదర్శిగా యాదయ్య

మర్రిగూడ : టీఎస్ యూటీఎఫ్ జిల్లా సాంస్కృతిక కార్యదర్శిగా మర్రిగూడ మండలంలోని ఖుదాబాక్షపల్లి గ్రామ జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు గిరి యాదయ్య ఎన్నికయ్యారు. ఆదివారం నార్కట్‌పల్లిలో జరిగిన టీఎస్ యూటీఎఫ్ 6వ మహాసభలో తనను ఎన్నుకున్నట్లు గిరి యాదయ్య తెలిపారు.

కోలాటం బృందానికి చేయూత

మర్రిగూడ : మండలంలోని యరగండ్లపల్లి గ్రామ మహిళలు కోలాటంలో శిక్షణ పొందేందుకు ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు పులిమామిడి నరసింహారెడ్డి, ఏడుదొడ్ల కృష్ణారెడ్డి సోమవారం రూ.25 వేలు అందించారు. ఈ సందర్భంగా పులిమామిడి నరసింహారెడ్డి మాట్లాడుతూ మహిళలను ప్రోత్సహించేందుకు తమ వంతు కృషి చేస్తానన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులు పరిశీలిస్తున్న డీఈ

మునుగోడు: రోడ్డు పనుల్లో ఎలాంటి నాణ్యత లోపం ఉండవద్దని, నిబంధనల ప్రకారం రోడ్ల నిర్మాణం చేపట్టకుంటే సహించేది లేదని పంచాయతీరాజ్ డీఈ నాగేశ్వర్‌రావు హెచ్చరించారు. మునుగోడు మండలంలోని గుండ్లోరిగూడెంలో జరుగుతున్న బీటీ రోడ్డు పనులను సోమవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు.

శివుడికి అభిషేకం

రామగిరి (నల్లగొండ): నల్లగొండలోని అన్నేశ్వరమ్మ గుట్టపై గల శివుడికి సత్య సాయి ధ్యాన మండలి వ్యవస్థాపకుడు భిక్షమయ్య గురూజీ అభిషేకం పూజలు నిర్వహించారు. ప్రసాద్ గురూజీ, ప్రతాప్ మహారాజ్, వెంకటేశ్వర్లు గురూజీ, ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి, సత్య సాయి ధ్యాన మండలి సభ్యులు పాల్గొన్నారు.

సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం

నకిరేకల్ : నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్ మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం చిత్రపటాలకు నకిరేకల్‌లో పాలాభిషేకం చేశారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజన్‌కుమార్ యాదవ్, జహంగీర్, మాద వంశీ, ఏకుల గణేశ్, పాలడుగు సందీప్, అబ్బగోని శివ, మేడిపల్లి ఉమేష్ పాల్గొన్నారు.